GHMC hmda TS-bPASS
MAKAM GANGADHAR NETHA
President (GHMC)
Telangana Building Planners Association
E-mail ID : sriswamiplanners@gmail.com
వాస్తుకి బిల్డింగ్ ప్లానింగ్, నక్ష చేయబడును
డిజిటల్ లాండ్స్ సర్వే, లే-అవుట్లు,
నక్ష ప్లానింగ్ చేయబడును,
SRI SWAMI ASSOCIATES
ARCHITECTS•ENGINEERS•SURVEYORS
We Undertake Building Plans, Lay-Out Plans & Permissions, LRS, BRS, Tax Assesments
Auto DCR Online Up Loading, Pre DCR Cad Drawing
భవన నిర్మాణం దరఖాస్తు కొరకు సంప్రదించండి.
GHMC, HMDA, DTCP, TS-bpass - Layout's, Building Permissions
H.No. 11-5-565, Bhagya Laxmi Towers, Opp: GHMC Circle Office, Saroornagar, Hyderabad - 500035
Mob : 9393929595

Happy 75th Independence Day
క్రైమ్ మిర్రర్ ®
Voice of Anti Corruption
తెలంగాణ జిల్లాలు
ఆదివారం 28-06-2026 పబ్లిషింగ్ సెంటర్ : హైదరాబాద్

# మూతబడిపోయాయి

**దేవరకొండ నియోజకవర్గంలో 150 పాఠశాలల మూసివేత**

**ఒక్క చందంపేట మండలంలోనే 38 బడులు క్లోజ్**

**గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వ పాఠశాలలపై తగ్గుతున్న ఆసక్తి**

**వసతుల లేమి, సరైన బోధన లేకపోవడమే కారణం**



**చందంపేట (క్రైమ్ మిర్రర్):**

జూన్ 27 : గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వ బడులు పతనావస్థలో ఉన్నాయి. సరైన వసతులు లేకపోవడం.. తల్లిదండ్రులు తమ పిల్లలను పట్టణాలకు పంపేందుకు మొగ్గు చూపుతుండటంతో మారుమూల ప్రాంతాల్లోని సర్కార్ బడులను మూసివేస్తున్నారు. దేవరకొండ నియోజకవర్గంలోని చందంపేట, దేవరకొండ, నేరేడుగొమ్ము, గుండ్లపల్లి, చింతపల్లి, కొండమల్లేపల్లి, పీఏపల్లి, గుడిపల్లి మండలాల్లో 150 పాఠశాలలు మూతపడగా ఒక్క చందంపేట మండలంలోనే 38 ప్రభుత్వ పాఠశాలలు మూతపడ్డాయంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు..

**గ్రామీణ ప్రాంతాల్లో అగమ్యగోచరం**

నల్లగొండ జిల్లాలోని గ్రామీణ ప్రాంతాలు.. పల్లెల్లో మారుతున్న జీవన పరిస్థితులు.. కుటుంబాలు జీవనోపాధి కోసం పట్టణ ప్రాంతాలకు వలస వెళ్తుండటంతో పాటు తమ పిల్లలను గ్రామీణ ప్రాంతాల్లోని పాఠశాలల్లో కాకుండా పట్టణ ప్రాంతాల్లో చేర్పించేందుకు తల్లిదండ్రులు ఆసక్తి చూపిస్తుండటం కూడా ప్రభుత్వ బడులు మూతపడేందుకు ఒక కారణం. గతంలో ఉపాధ్యాయులు విధులకు సక్రమంగా రావడం లేదనే విమర్శలు ఉండేవి. ఇటీవల ఐరిస్ అటెండెంట్స్ తీసుకొచ్చినప్పటికీ విద్యార్థుల అడ్మిషన్లు తగ్గుతుండటం ఆందోళనకరం

మిగతా 2లో

**క్లోజ్**
**దిశగా మరికొన్ని..**

అడ్మిషన్లు లేకపోవడంతో నియోజకవర్గంలోని పలు మండలాల్లో ప్రభుత్వ పాఠశాలల నిర్వహణ దారుణంగా తయారైంది. అడ్మిషన్లు లేకపోవడంతో ఆయా మండలాల్లోని పలు ప్రభుత్వ పాఠశాలలు మూతపడే పరిస్థితి నెలకొంది. కొన్ని పాఠశాల్లో ఇద్దరు, ముగ్గురు విద్యార్థులకు ఇద్దరు, ముగ్గురు ఉపాధ్యాయులు ఉండటం గమనార్హం. దేవరకొండ మండలంలోని మైనంపల్లి గ్రామ సర్పంచ్ కొర్ర రాంసింగ్ నాయక్ ప్రత్యేక చొరవ తీసుకొని తన ఇద్దరు పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించి గ్రామస్తులకు ప్రేరణగా నిలిచారు. దీంతో ఆ పాఠశాలలో అడ్మిషన్లు పెరిగాయి. ఇదే విధంగా సర్పంచులు, ఉపాధ్యాయులతో కలిసి బాధ్యత తీసుకొని గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలను బతికించేందుకు చొరవ చూపాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

# మంథనిలో.. 'కమలం' జోరు..!!

- మండల కార్యకర్తల కష్టంతో గ్రామ స్థాయిలో విస్తరిస్తున్న పార్టీ
- యువత, మహిళల్లో పెరుగుతున్న ఆకర్షణ
- బూత్ కమిటీలతో క్షేత్రస్థాయిలో పట్టు బిగిస్తున్న కమలం
- కాంగ్రెస్ ప్రభుత్వంపై అసంతృప్తిని అవకాశంగా మలుచుకునే ప్రయత్నం

3లో

# ఎక్టోపిక్ ప్రెగ్నెన్సీతో ప్రాణాపాయంలో మహిళ..

- అత్యవసర శస్త్రచికిత్సతో ప్రాణాలు కాపాడిన మెడికవర్ వైద్యులు
- ఎక్టోపిక్ ప్రెగ్నెన్సీని సకాలంలో గుర్తించిన మెడికవర్ వైద్యులు
- అత్యవసర శస్త్రచికిత్సతో విజయవంతమైన చికిత్స
- ఫెలోపియన్ ట్యూబ్ పగిలి భారీ రక్తస్రావం
- ఐసియులో చికిత్సతో కోలుకున్న మహిళ
- మల్టీడిసిప్లినరీ బృందం సమన్వయంతో ప్రాణరక్షణ
- నెలసరి ఆలస్యం, కడుపు నొప్పిని నిర్లక్ష్యం చేయొద్దు

4లో

# ఏజెంట్లు ఎంట్రీ ఇస్తే.. ఆర్టీఓలదే బాధ్యత!

ఆర్టీఏ కార్యాలయాల్లో ఏజెంట్ల కార్యకలాపాలకు ఇకపై ఆర్టీఓలే బాధ్యత వహించాల్సి ఉంటుంది.. ఎటువంటి అనాధికార వ్యక్తులు కార్యాలయాల్లో పనులు చక్కబెట్టే విధానంపై కఠిన చర్యలు ఉండనున్నాయి.. జూన్ 24న 'ఏజెంట్లదే రాజ్యం-అధికారుల కొర్రీలు.. ఏజెంట్ల పరిష్కారాలు' శీర్శికన 'నమస్తే తెలంగాణ' కథనం ప్రచురించింది. ఇబ్రహీంపట్నం, మేడ్చల్, బండ్లగూడ, నాగోల్, మణికొండ, కొండాపూర్ ఆర్టీఏ కార్యాలయాల్లో ఏసీబీ సోదాలు అందులో భాగంగా విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ మామిండ్ల చంద్రశేఖర్ గౌడ్ శనివారం ఇబ్రహీంపట్నం ఆర్టీఓ కార్యాలయాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. పలు దస్త్రాలు, సేవల్లో జాప్యం, లైసెన్స్ జారీ ప్రకియపై ఆరా తీశారు. లైసెన్స్ జారీ ప్రక్రియలో ఏజెంట్ల చొరవ జేటీసీ దృష్టికి రావడంతో అధికారులపై సీరియస్ అయ్యారు. కార్యాలయాల్లో అనధికార వ్యక్తుల కార్యకలాపాలకు సంబంధిత కార్యాలయ అధికారులే బాధ్యత వహించాలని హెచ్చరించారు. సేవల పట్టికను కౌంటర్లు, ప్రధాన ద్వారాల వద్ద ఏర్పాటు చేయాలని సూచించారు. ఏజెంట్లను అనుమతించిన అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. అనంతరం జేటీసీ మాట్లాడుతూ.. డ్రైవింగ్ లైసెన్స్ పరీక్ష నిర్వహణ తీరును పరిశీలించారు. ప్రస్తుత ప్రమాణాలు రహదారి భద్రతకు తగినంతగా ఉన్నాయా అని అంచనా వేసి, డ్రైవింగ్ పరీక్ష మరింత కఠినంగా,



సమగ్రంగా నిర్వహించాలని సూచించారు. డ్రైవింగ్ లైసెన్స్ అనేది కేవలం ఒక పత్రం మాత్రమే కాదు. అది రహదారిపై వాహనం నడపడానికి ఇచ్చే అనుమతి.. నిర్లక్ష్యంగా నిర్వహించే పరీక్షలు నేరుగా రోడ్డు ప్రమాదాలకు దారితీస్తాయి... నిజంగా నైపుణ్యం కలిగిన వాహనదారులకు మాత్రమే లైసెన్స్ జారీ చేయాలి.. అని అన్నారు. ఈ సందర్భంగా జేటీసీ దరఖాస్తుదారులతో , సాధారణ ప్రజలతో నేరుగా మాట్లాడారు. ప్రజలకు అందుతున్న సర్వీసెస్, వేచి ఉండే సమయం, సిబ్బంది వ్యవహారం, ఆన్‌లైన్ పోర్టల్ వినియోగంపై అభిప్రాయాలు సేకరించారు. ప్రతి దరఖాస్తుదారుని మర్యాదగా చూడాలని, నిర్దేశిత గడువులోపు దరఖాస్తులు పరిషరించాలని సిబ్బందికి సూచించారు.

# తక్కువ ధరకే స్వచ్ఛమైన బంగారమంటూ.. చీటింగ్

### గోల్డ్ మ్యాన్ సూర్యకు 14 రోజుల రిమాండ్

హిమాయత్‌నగర్: తక్కువ ధరకే స్వచ్ఛమైన బంగారమంటూ.. మోసం చేసిన గోల్డ్ మ్యాన్‌గా పేరొందిన సూర్యాబాయ్‌ను నారాయణగూడ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. మేడ్చల్ జిల్లా కమల ఈస్ట్‌నగర్‌లో ఉంటున్న వేగ్రోజ్ కృష్ణాచారి నవీన్ సింగ్ అనే వ్యక్తితో కలిసి హిమాయత్‌నగర్‌లోని ఎన్‌ఎస్ జ్యువెల్లరీ దుకాణం నడుపుతున్నాడు. భీమేశ్వరచారి అనే వ్యక్తి సూచన మేరకు సూర్యాబాయ్ అలియాస్ గోల్డ్ మ్యాన్(34)ను కృష్ణాచారి కలిశారు. అతడు 1 కిలో బంగారం అందుబాటులో ఉందని, దానికి రూ.1కోటి 50 లక్షల ధర నిర్ణయించినట్లు చెప్పి.. కొంత డబ్బు చెల్లించాలని డిమాండ్ చేశాడు. సూర్యాబాయ్ రూ. 27 లక్షల నగదుతో పాటు రూ.5లక్షల 30వేల విలువైన బంగారు ఆభరణాలను తీసుకున్న తరువాత ..కిలో బంగారాన్ని ఇవ్వకుండా మోసం చేశాడు. నారాయణగూడ పోలీసులు సూర్యాబాయ్‌ని అరెస్టు చేశారు. న్యాయస్థానం 14 రోజులు రిమాండ్ విధించగా, చంచల్‌గూడ జైలుకు తరలించారు.

# రోడ్డుపై చెత్త వేయొద్దన్నందుకు..

# పారిశుధ్య కార్మికురాలిపై దాడి



వి ం య్ రా వ్రా ర్ : గృహంలోని చెత్తను రహదారిపై వేయొద్దని చెప్పిన పారిశుధ్య కార్మికురాలిపై ఓ మహిళ దాడికి పాల్పడింది. దీనబంధు కాలనీలో ఓ మహిళ ద్విచక్ర వాహనంపై వచ్చి రహదారిపై చెత్త వేస్తుండగా, పారిశుధ్య కార్మికురాలు మైబు రోడ్డుపై చెత్త వేయవద్దని వారించింది. ఆగ్రహించిన సదరు మహిళ.. దాడికి పాల్పడింది. బాధితురాలు జగద్గిరిగుట్ట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పారిశుధ్య కార్మికురాలపై దాడిని డీసీ చాముండేశ్వరి ఖండించారు. పారిశుధ్య కార్మికురాలిపై దాడిని స్వచ్ఛ ఆటో టిప్పర్, ఆటో రిక్షా కార్మిక సంఘం అధ్యక్షుడు కాలమడుగు రాజేందర్ తీవ్రంగా ఖండించారు.

# మూతబడిపోయాయి

ఇటీవల ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్ల సంఖ్య పెంచేందుకు చేపట్టిన బడిబాట కార్యక్రమం చెప్పుకోదగ్గ ఫలితాలు ఇవ్వడంలేదు. ఉపాధ్యాయులు సైతం ఏదో పాల్గొనాలి కదా..అనే ఉద్దేశంతో పాల్గొంటున్నారనే విమర్శలు వస్తున్నాయి. ప్రభుత్వ బడులను కాపాడుకునేందుకు ఒకటీ రెండు చోట్ల చేసిన ప్రయత్నాలు మాత్రం ఫలించాయి. చందంపేట మండలంలోని పెద్దమూల, నల్లచెల్లమూల ప్రాథమిక పాఠశాలలు పునఃప్రారంభమయ్యాయి అంతే తప్ప చెప్పుకోదగిన స్థాయిలో అడ్మిషన్లు పెరగడంలేదనే చెప్పాలి. చందంపేట మండలంలో గతంలో 45కి పైగా పాఠశాలలు ఉంటే ఇప్పుడు కేవలం 14 ప్రభుత్వ పాఠశాలలు మాత్రమే మనుగడ సాగిస్తున్నాయి. మండలంలో రాను రాను ప్రభుత్వ పాఠశాలల మనుగడ ప్రశ్నార్థకమయ్యే పరిస్థితులు కనిపిస్తుండటం ఆందోళన కలిగిస్తున్న అంశం. మండలంలోని ముదుదండ్ల, పోల్యానాయక్ తండా, కొర్రతండా, రేకుల గడ్డ, బుడ్డోనితండా, కాకనూరి తండా, బొల్లారం పట్టి, అచ్చంపేట పట్టి, ఉస్మాన్‌కుంట, యల్మలమంద, రేకుల వలయం ఇలా కొన్ని గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలలు మూతపడ్డాయి. చందంపేట మండలంలో ఇప్పటికే చాలా వరకు ప్రభుత్వ బడులు మూతపడిన విషయం వాస్తవమే. అడ్మిషన్లు లేకపోవడంతో ప్రభుత్వం ఆయా పాఠశాలలను మూసివేసింది. ఇప్పుడు మండలంలో ప్రాథమిక, ఉన్నత, ఆశ్రమ, కేజీబీవీ, గురుకుల పాఠశాలలతో కలుపుకొని సుమారు 580 మంది విద్యనభ్యసిస్తున్నారు. మండలంలో మూతపడిన పాఠశాలలను తిరిగి తెరిపించేందుకు కృషి చేసి, రెండు పాఠశాలలు తెరిపించగలిగాం. గ్రామస్తుల సహకారంతో పాఠశాలలు పునఃప్రారంభించేందుకు కృషి చేస్తున్నాం.

# చిరు వ్యాపారాలపై మళ్లీ బుల్డోజర్లు



మణికొండ, జూన్ 27: పాదచారులకు సురక్షితమైన పుట్‌పాత్‌లను అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రత్యేక డ్రైవ్ నిర్వహించింది. డిప్యూటీ కమిషనర్ల పర్యవేక్షణలో టౌన్‌ప్లానింగ్ విభాగం, పోలీసు శాఖ సమన్వయంతో చేపట్టిన కార్యక్రమంలో పుట్‌పాత్‌లను ఆక్రమించిన ఆహార స్టాళ్లు, వీధి వ్యాపారాలు, తాత్కాలిక నిర్మాణాలు తదితర అనధికార ఆక్రమణలను తొలగించారు. శేరిలింగంపల్లి జోన్ పరిధిలోని నార్సింగి సర్కిల్ గండిపేట ఎక్స్ రోడ్ నుంచి సాయిబాబా దేవాలయం వరకు పుట్‌పాత్‌లపై ఉన్న ఆక్రమణలను తొలగించారు. అలాగే పటాన్‌చెరువు, అమీన్‌పూర్, మియాపూర్, శేరిలింగంపల్లి సర్కిళ్లలోనూ ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఈ జోన్‌లో మొత్తం 5 రహదారి విభాగాల్లో 10.8 కిలోమీటర్ల మేర పుట్‌పాత్‌లను ఆక్రమణల నుంచి విముక్తం చేసి 197 ఆక్రమణలను తొలగించారు. అలాగే కూకట్‌పల్లి జోన్‌లోని మూడు రహదారి విభాగాల్లో 3.16 కి.మీ మేర 105 ఆక్రమణలు, కుత్బుల్లాపూర్ జోన్‌లో ఏడు రహదారి విభాగాల్లో 15.53 కి.మీ మేర 204 ఆక్రమణలను తొలగించారు. మొత్తం 30.29 కిలోమీటర్ల పుట్‌పాత్‌లను ఆక్రమణల నుంచి విముక్తం చేశారు.

# వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరి దుర్మరణం

### మృతుల్లో ఒకరు ఐటీ ఉద్యోగిని

### రాయదుర్గం పీఎస్ పరిధిలో ఘటనలు



**శేరిలింగంపల్లి, జూన్ 27:** రాయదుర్గం పరిధిలో జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మరణించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చింతల నరేశ్ తన భార్య, ఐటీ ఉద్యోగిని కల్యాణి (30)తో కలిసి శనివారం ద్విచక్రవాహనంపై వెళ్తూ..గచ్చిబౌలి బయో డైవర్సిటీ జంక్షన్ వద్ద యూ టర్న్ తీసుకుంటుండగా, వెనుక నుంచి వచ్చిన కారు అదుపు తప్పి వీరి వాహనాన్ని ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన కల్యాణి చనిపోయింది. మరో ఘటనలో గచ్చిబౌలి జేవీ కాలనీలో నివసిస్తున్న అబ్బీ ఆనంద్ సింగ్ (27) శుక్రవారం రాత్రి ద్విచక్రవాహనంపై వెళ్తూ..ఖాజాగూడ లేక్ రోడ్డు వద్ద యూ టర్న్ తీసుకుంటుండగా, మరో ద్విచక్రవాహనం ఢీకొట్టింది. ఆనంద్ సింగ్ తీవ్ర గాయాలకు గురై అక్కడికక్కడే మృతి చెందాడు.



## మెడికల్ ఆఫీసర్ పోస్టుకు వాక్-ఇన్ ఇంటర్వ్యూ

**జూన్ 29న డీఎంహెచ్ఓ కార్యాలయంలో నిర్వహణ**

**మంచిర్యాల,జూన్ 27 (క్రైమ్ మిర్రర్):** జిల్లా వైద్య,ఆరోగ్య శాఖ పరిధిలోని (బీడీకే)చెన్నూర్ ఆసుపత్రిలో ఖాళీగా ఉన్న మెడికల్ ఆఫీసర్ పోస్టును ఒప్పంద ప్రాతిపదికన భర్తీ చేయనున్నట్లు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ నరేందర్ రాథోడ్ తెలిపారు. ఈ మేరకు శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.ఈ పోస్టుకు ఎంబీబీఎస్ ఉత్తీర్ణులై, తెలంగాణ మెడికల్ కౌన్సిల్, నేషనల్ మెడికల్ కౌన్సిల్‌లో చెల్లుబాటు అయ్యే రిజిస్ట్రేషన్ కలిగిన అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు.అర్హత,ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈ నెల 29న ఉదయం 11 గంటలకు మంచిర్యాల ఐడీఓసీ భవనంలోని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి కార్యాలయంలో నిర్వహించే వాక్-ఇన్ ఇంటర్వ్యూకు హాజరుకావాలని సూచించారు.ఇంటర్వ్యూకు హాజరయ్యే అభ్యర్థులు విద్యార్హతలు,మెడికల్ కౌన్సిల్ రిజిస్ట్రేషన్‌తో పాటు ఇతర సంబంధిత అన్ని అసలు ధ్రువపత్రాలను వెంట తీసుకురావాలని డీఎంహెచ్ఓ డాక్టర్ నరేందర్ రాథోడ్ తెలిపారు.మరిన్ని వివరాలకు మంచిర్యాల జిల్లా అధికారిక వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

## చలో కొడంగల్ బ్యానర్ ను ఆవిష్కరించిన ఎమ్మెల్యే కుంభం

**వలిగొండ జూన్ 27(క్రైమ్ మిర్రర్):** ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ చీమ శ్రీనివాస్ పిలుపుమేరకు రేపు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నియోజకవర్గం కొడంగల్ లో జరిగే కృతజ్ఞత ర్యాలీ బ్యానర్ ను ఉద్యమకారుల ఫోరం మండల అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో స్థానిక శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి ఆవిష్కరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఉద్యమకారులకు ఇచ్చిన హామీ నెరవేర్చినందుకు కేకే కమిటీని నియమించిందని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఇచ్చిన ప్రతిని ప్రతిహామీని నెరవేరుస్తుందని ఆయన అన్నారు. ఉద్యమకారులు చేపట్టే కృతజ్ఞత ర్యాలీ కార్యక్రమం అభినందనీయమని ఫోరం నాయకులను అభినందించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ కుంభ వెంకట్ పాపిరెడ్డి, ఉపసర్పంచ్ మల్గ మాధవి,ఉద్యమకారుల ఉమ్మడి నల్లగొండ జిల్లా అధ్యక్షుడు శీలం స్వామి, కళ్లెం లక్ష్మారెడ్డి,జిల్లా ప్రధాన కార్యదర్శి బత్తిని రవీందర్ గౌడ్, గౌరవ సలహాదారుడు బత్తిని సహదేవ్ గౌడ్, ఎంపీటీసీల ఫోరం మాజీ అధ్యక్షుడు పల్సం సతీష్ గౌడ్ , గరిసె రవి,చిలుగూరి సత్తిరెడ్డి, కదిరేని స్వామి, బోడిగె సుదర్శన్,ఐటిపాముల పుష్ప, దండ మల్లికార్జున్, కొండూరు సత్తయ్య, ఎదురుగట్ల పెద్దయాదగిరి, చిన్న యాదగిరి, లక్ష్మయ్య,సందయ్య, తదితర ఉద్యమకారులు పాల్గొన్నారు.



# మంథనిలో..'కమలం' జోరు..!!

- మండల కార్యకర్తల కష్టంతో గ్రామ స్థాయిలో విస్తరిస్తున్న పార్టీ
- యువత, మహిళల్లో పెరుగుతున్న ఆకర్షణ
- బూత్ కమిటీలతో క్షేత్రస్థాయిలో పట్టు బిగిస్తున్న కమలం
- కాంగ్రెస్ ప్రభుత్వంపై అసంతృప్తిని అవకాశంగా మలుచుకునే ప్రయత్నం
- స్థానిక సమస్యలపై పోరాటాలతో ప్రజల్లోకి వెళ్తున్న నాయకత్వం
- రానున్న ఎన్నికలే లక్ష్యంగా వ్యూహాత్మక అడుగులు





**క్రైమ్ మిర్రర్, భూపాలపల్లి ప్రతినిధి:** ఒకప్పుడు ప్రధానంగా కాంగ్రెస్, బీఆర్ఎస్ రాజకీయ ఆధిపత్యం కనిపించిన మంథని నియోజకవర్గంలో ప్రస్తుతం భారతీయ జనతా పార్టీ (బీజేపీ) క్రమంగా తన బలాన్ని పెంచుకుంటూ ముందుకు సాగుతోంది. రాష్ట్రంలో మారుతున్న రాజకీయ పరిస్థితులు, గ్రామీణ స్థాయిలో పెరుగుతున్న పార్టీ కార్యకలాపాలు, యువతలో బీజేపీపై పెరుగుతున్న ఆసక్తి, కాంగ్రెస్ ప్రభుత్వంపై వ్యక్తమవుతున్న అసంతృప్తి వంటి అంశాలు కమలం పార్టీకి అనుకూల వాతావరణాన్ని సృష్టిస్తున్నాయని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. గ్రామ స్థాయి నుంచి పార్టీ బలోపేతం, మంథని నియోజకవర్గ పరిధిలోని పలు మండలాల్లో బీజేపీ కార్యకర్తలు పార్టీని గ్రామ స్థాయి నుంచి బలోపేతం చేసే కార్యక్రమాలను విస్తృతంగా చేపడుతున్నారు.

**ముఖ్యంగా..**

- ప్రతి గ్రామంలో బూత్ కమిటీల ఏర్పాటు
- కొత్త సభ్యత్వ నమోదు కార్యక్రమాలు
- యువతను పార్టీ వైపు ఆకర్షించే సమావేశాలు
- మహిళా మోర్చా, యువ మోర్చా కార్యక్రమాల విస్తరణ
- కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన
- ప్రజా సమస్యలపై ప్రత్యక్షంగా స్పందించడం

ఈ కార్యక్రమాల ద్వారా పార్టీకి గ్రామాల్లో కొత్త మద్దతు లభిస్తోందని నాయకులు చెబుతున్నారు.

**మండల కార్యకర్తలే పార్టీకి వెన్నెముక**

మంథని నియోజకవర్గంలో బీజేపీ ఎదుగుదల వెనుక మండల స్థాయి కార్యకర్తల కృషి కీలక పాత్ర పోషిస్తోందని పార్టీ నాయకత్వం భావిస్తోంది. ఏళ్ల తరబడి అధికారానికి దూరంగా ఉన్నప్పటికీ పార్టీ జెండాను మోస్తూ, ప్రజల్లో పార్టీ సిద్ధాంతాలను తీసుకెళ్లిన కార్యకర్తల కృషి ఇప్పుడు ఫలితాలు ఇస్తోందని చెబుతున్నారు.

**కార్యకర్తలు చేస్తున్న పనులు..**

- గ్రామాల వారీగా పర్యటనలు
- ఇంటింటి ప్రచారం
- కేంద్ర పథకాల ప్రచారం
- సామాజిక కార్యక్రమాల్లో పాల్గొనడం
- స్థానిక సమస్యలపై పోరాటాలు
- యువతతో ప్రత్యక్ష మమేకం

ఇవన్నీ పార్టీకి గ్రామ స్థాయిలో పట్టు పెరగడానికి దోహదపడుతున్నాయని అంటున్నారు.

**కాంగ్రెస్ ప్రభుత్వంపై అసంతృప్తి బీజేపీకి కలిసొస్తుందా?**

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అనేక హామీలు ఇచ్చినప్పటికీ, వాటి అమలుపై కొన్ని వర్గాల్లో అసంతృప్తి వ్యక్తమవుతోందని రాజకీయ వర్గాలు చెబుతున్నాయి.

**ప్రజలు ప్రస్తావిస్తున్న అంశాలు..**

- కొన్ని సంక్షేమ పథకాల అమలులో ఆలస్యం
- నిరుద్యోగ యువతలో అసంతృప్తి
- స్థానిక అభివృద్ధి పనులపై విమర్శలు
- రైతుల సమస్యల పరిష్కారంలో జాప్యం
- గ్రామీణ సమస్యలపై స్పందన లోపించిందనే ఆరోపణలు

ఈ పరిస్థితులను బీజేపీ నాయకులు రాజకీయ అవకాశంగా మలుచుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. యువతలో పెరుగుతున్న ఆదరణ మంథని ప్రాంతంలో యువతలో రాజకీయ చైతన్యం పెరుగుతున్న నేపథ్యంలో బీజేపీ ప్రత్యేక వ్యూహాలతో ముందుకు సాగుతోంది.

యువతను ఆకర్షిస్తున్న అంశాలు..

- డిజిటల్ ప్రచారం
- సోషల్ మీడియా ద్వారా చేరువ
- యువ మోర్చా కార్యక్రమాలు
- ఉపాధి, నైపుణ్యాభివృద్ధిపై చర్చలు
- జాతీయ రాజకీయాలపై ఆసక్తి

దీంతో మొదటిసారి ఓటు హక్కు వినియోగించబోయే యువతలో బీజేపీకి మద్దతు పెరుగుతోందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

**బీఆర్ఎస్ బలహీనత కూడా ప్రభావం చూపుతుందా?**

గతంలో బలమైన రాజకీయ శక్తిగా ఉన్న బీఆర్ఎస్ ప్రస్తుతం కొన్ని ప్రాంతాల్లో బలహీనపడిన పరిస్థితులు కనిపిస్తున్నాయని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

- కొంతమంది మాజీ నాయకులు ప్రత్యామ్నాయ రాజకీయ వేదికల కోసం చూస్తున్నారు
- కార్యకర్తల్లో నిరాశ కనిపిస్తోందని చర్చ
- కొంత ఓటు బ్యాంకు కొత్త రాజకీయ దిశగా వెళ్లే అవకాశాలు

ఈ పరిణామాలు కూడా బీజేపీకి పరోక్షంగా లాభించే అవకాశం ఉందని రాజకీయ పరిశీలకులు చెబుతున్నారు.

**స్థానిక సంస్థల ఎన్నికలపై ప్రత్యేక దృష్టి**

రాబోయే గ్రామ పంచాయతీ, ఎంపీటీసీ, జెడ్పీటీసీ, మున్సిపల్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని బీజేపీ ఇప్పటికే ప్రణాళికలు సిద్ధం చేస్తోంది.

**లక్ష్యాలు..**

- ప్రతి గ్రామంలో కమిటీ - ప్రతి బూత్‌లో కార్యకర్త
- ప్రతి మండలంలో బలమైన నాయకత్వం
- ప్రజా సమస్యలపై ఉద్యమాలు

**రాజకీయ సమీకరణాల్లో మార్పు తప్పదా?**

మంథని రాజకీయాలు సంప్రదాయంగా కాంగ్రెస్, బీఆర్ఎస్ చుట్టూ తిరిగినప్పటికీ ప్రస్తుతం బీజేపీ మూడో శక్తిగా కాకుండా ప్రత్యామ్నాయ శక్తిగా ఎదగాలనే లక్ష్యంతో ముందుకు సాగుతోంది. గ్రామ స్థాయి కార్యకర్తల కష్టం, యువతలో పెరుగుతున్న ఆకర్షణ, కాంగ్రెస్ ప్రభుత్వంపై వ్యక్తమవుతున్న వ్యతిరేకత, మారుతున్న రాజకీయ పరిస్థితులు బీజేపీకి కలిసొస్తున్నాయి. అయితే ఈ ఊపును ఎన్నికల ఫలితాల వరకు కొనసాగించగలదా.. ప్రజల విశ్వాసాన్ని ఓట్లుగా మార్చుకోగలదా..? అన్నది రానున్న రోజుల్లో తేలనుంది.

**- తులసి నగేష్, భూపాలపల్లి ప్రతినిధి**

# ఎక్టోపిక్ ప్రెగ్నెన్సీతో ప్రాణాపాయంలో మహిళ..

- అత్యవసర శస్త్రచికిత్సతో ప్రాణాలు కాపాడిన మెడికవర్ వైద్యులు
- ఎక్టోపిక్ ప్రెగ్నెన్సీని సకాలంలో గుర్తించిన మెడికవర్ వైద్యులు
- అత్యవసర శస్త్రచికిత్సతో విజయవంతమైన చికిత్స
- ఫెలోపియన్ ట్యూబ్ పగిలి భారీ రక్తస్రావం
- ఐసియులో చికిత్సతో కోలుకున్న మహిళ
- మల్టీడిసిప్లినరీ బృందం సమన్వయంతో ప్రాణరక్షణ
- నెలసరి ఆలస్యం, కడుపు నొప్పిని నిర్లక్ష్యం చేయొద్దు
- ఎక్టోపిక్ ప్రెగ్నెన్సీపై వైద్యుల హెచ్చరిక
- సకాలంలో చికిత్సే ప్రాణరక్షణ
- అప్రమత్తతతో విజయవంతమైన వైద్యం




**పటాన్‌చెరు, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి జూన్ 27:** గర్భాశయం వెలుపల పిండం పెరగడంతో అంటే ఎక్టోపిక్ ప్రెగ్నెన్సీ తీవ్ర అంతర్గత రక్తస్రావానికి గురై ప్రాణాపాయ స్థితిలో ఆస్పత్రికి చేరిన 34 ఏళ్ల మహిళకు చందానగర్‌లోని మెడికవర్ హాస్పిటల్స్ వైద్యులు అత్యవసర శస్త్రచికిత్స నిర్వహించి ప్రాణాలు కాపాడారు. కొన్ని రోజులుగా నెలసరి ఆలస్యం కావడంతో పాటు తీవ్రమైన కడుపు నొప్పి, నీరసం, అస్వస్థతతో బాధపడుతున్న మహిళను కుటుంబ సభ్యులు అత్యవసరంగా ఆస్పత్రికి తరలించారు. పరీక్షల సమయంలో ఆమె రక్తపోటు ప్రమాదకర స్థాయిలో ఉండగా, గుండె స్పందన కూడా అధికంగా నమోదైంది. వెంటనే అత్యవసర చికిత్స ప్రారంభించిన వైద్యులు ఐసీయూకు తరలించి వెంటిలేటర్ సాయంతో చికిత్స అందించారు. అల్ట్రాసౌండ్ పరీక్షల్లో గర్భాశయం వెలుపల పిండం పెరగడంతో కుడి ఫెలోపియన్ ట్యూబ్ పగిలి కడుపులో భారీగా రక్తస్రావం జరిగినట్లు గుర్తించారు. దీంతో బ్లడ్ బ్యాంక్‌ను అప్రమత్తం చేసి అవసరమైన రక్తాన్ని అందుబాటులోకి తెచ్చి అత్యవసర శస్త్రచికిత్స చేపట్టారు. డా. భావ్య, సీనియర్ కన్సల్టెంట్ ప్రసూతి అండ్ గైనకాలజీ నిపుణురాలి నేతృత్వంలోని బృందం విజయవంతంగా శస్త్రచికిత్స నిర్వహించి పగిలిన ఫెలోపియన్ ట్యూబ్‌ను తొలగించి రక్తస్రావాన్ని పూర్తిగా నియంత్రించింది. అనంతరం డా. రాజు ఆధ్వర్యంలోని క్రిటికల్ కేర్ బృందం ఐసియులో ప్రత్యేక చికిత్స అందించడంతో మహిళ పూర్తిగా కోలుకుని ఆరోగ్యంగా డిశ్చార్జ్ అయ్యారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ.. ఎక్టోపిక్ ప్రెగ్నెన్సీ మహిళల ప్రాణాలకు ముప్పు కలిగించే అత్యవసర పరిస్థితి అని పేర్కొన్నారు. నెలసరి ఆలస్యం, తీవ్రమైన కడుపు నొప్పి, తలతిరగడం, బలహీనత, అకస్మాత్తుగా రక్తపోటు తగ్గడం వంటి లక్షణాలు కనిపిస్తే నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. సకాలంలో నిర్ధారణ, అత్యవసర శస్త్రచికిత్స, వైద్య బృందాల సమన్వయంతో చికిత్స అందించడం వల్లే మహిళ ప్రాణాలను కాపాడగలిగామని తెలిపారు.

# అడ్డా, అసంఘటిత కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



**జూన్ 27 (క్రైమ్ మిర్రర్) :** జిల్లాలోని అడ్డా కార్మికులు, వివిధ రంగాల అసంఘటిత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని హింద్ మజ్దూర్ సభ మంచిర్యాల జిల్లా నాయకులు డిమాండ్ చేశారు. శనివారం జిల్లా అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్ దుర్గం క్రాంతి కుమార్‌ను హెచ్ఎంఎస్ జిల్లా అధ్యక్షుడు నరెడ్ల శ్రీనివాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి తాటిపర్తి సాయి కృష్ణలు కలిసి సమస్యలతో కూడిన సమగ్ర వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా హెచ్ఎంఎస్ నాయకులు మాట్లాడుతూ జిల్లాలో వేలాది మంది భవన నిర్మాణ కార్మికులు, దినసరి కూలీలు లేబర్ కార్డులు లేకుండానే పనులు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రమాదాలు జరిగినప్పుడు బీమా, ఆర్థిక సహాయం, సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందక వారి కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని వివరించారు. అందువల్ల జిల్లాలో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి అడ్డా కార్మికులందరికీ లేబర్ కార్డుల నమోదు ప్రక్రియను చేపట్టాలని కోరారు. లేబర్ కార్డు లేని కార్మికులను పనిలోకి తీసుకోకుండా మేస్త్రీలు, కాంట్రాక్టర్లకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేయాలని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అలాగే లేబర్ కార్డుల ప్రయోజనాలపై విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. మంచిర్యాల పట్టణంలో అడ్డా కార్మికుల కోసం ప్రత్యేక స్థలం కేటాయించి షెడ్లు నిర్మించడంతో పాటు తాగునీరు, మరుగుదొడ్లు వంటి మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. జీహెచ్ఎంసీ పరిధిలో అమలవుతున్నట్లుగా అడ్డా కార్మికులకు రూ. 5కే మధ్యాహ్న భోజనం అందించే పథకాన్ని మంచిర్యాల జిల్లాలోనూ అమలు చేసేలా రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలని కోరారు. జిల్లాలోని షాపింగ్ మాల్స్, హోటల్స్, షోరూమ్‌లు, ఇతర సంస్థల్లో పనిచేస్తున్న కార్మికులకు 'షాప్స్ అండ్ ఎస్టాబ్లిష్‌మెంట్స్' చట్టం ప్రకారం పని వేళలు అమలు చేయాలని, ఈఎస్ఐ, పీఎఫ్, కనీస వేతనాలు, ఇతర చట్టబద్ధ హక్కులు తప్పనిసరిగా అందేలా కఠిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. హెచ్ఎంఎస్ నాయకులు సమర్పించిన వినతిపత్రాన్ని స్వీకరించిన అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్ దుర్గం క్రాంతి కుమార్ సానుకూలంగా స్పందించారు. కార్మికుల సమస్యలను పరిశీలించి, చట్టప్రకారం అవసరమైన చర్యలు తీసుకునేందుకు తగిన కృషి చేస్తామని ఈ సందర్భంగా ఆయన హామీ ఇచ్చారు.

# ఎస్ఐఆర్ ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ ప్రక్రియ పరిశీలన...

**శేరిలింగంపల్లి క్రైమ్ మిర్రర్ :** శేరిలింగంపల్లి వార్డు పరిధిలోని పోలింగ్ స్టేషన్ 96లో జరుగుతున్న ఎస్ఐఆర్ ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ ప్రక్రియను సందర్శించి, క్షేత్రస్థాయి ఏర్పాట్లను క్షుణ్ణంగా పరిశీలించారు. ఫారాల పంపిణీ సజావుగా జరిగేలా, సకాలంలో పూర్తయ్యేలా అధికారులు మరియు ఓటర్లతో నేరుగా మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నాను. సమన్వయం, ఖచ్చితత్వం, సామర్థ్యం పాటించాలని సంబంధిత బృందాలను ఆదేశించడం



జరిగింది. ప్రజలకు అవసరమైన సహాయ సహకారాలు అందించడంలో ఎలాంటి జాప్యం లేకుండా చూడాలని, ప్రతి ఫారం కచ్చితంగా నమోదయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు . ఎన్యుమరేషన్ ప్రక్రియ పారదర్శకంగా, ఇబ్బందులు లేకుండా కొనసాగేలా అన్ని చర్యలు తీసుకుంటున్నాం అన్నారు . ఈ కార్యక్రమంలో ఉప కమిషనర్ తో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.



# లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం

- లయన్స్ క్లబ్ ఆఫ్ నేరేడుచర్ల మండల అధ్యక్షులు షేక్ యూసుఫ్
- లయన్స్ క్లబ్ ఆఫ్ నేరేడుచర్ల మండల కార్యదర్శి సరికొప్పుల నాగేశ్వరరావు

**క్రైమ్ మిర్రర్,హుజూర్ నగర్ (నేరేడుచర్ల):** లయన్స్ క్లబ్ ఆఫ్ నేరేడుచర్ల నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. లయన్స్ క్లబ్ నేరేడుచర్ల 2026-27 కు గాను నూతన అధ్యక్షులుగా షేక్ యూసుఫ్, కార్యదర్శిగా సరికొప్పుల నాగేశ్వరరావు, కోశాధికారిగా బదావత్ సైదులు నాయక్ ప్రమాణ స్వీకారం చేశారు. అలాగే ఉపాధ్యక్షులుగా నీలా శ్రీనివాస్, చిత్రం విశ్వనాథ్, మూలగుండ్ల వెంకటరెడ్డి, బసవ కోటేశ్వరరావు, తదితరులు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమానికి జిల్లా మాజీ గవర్నర్, మోటివేటర్, మల్టిపుల్ కౌన్సిల్ చైర్మన్ లయన్ గోలి అమరేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ, లయన్స్ క్లబ్ సభ్యత్వమే మన గౌరవాన్ని, సేవాభావాన్ని సమాజంలో మరింత పెంచుతుందని అన్నారు. ప్రతి లయన్ సభ్యుడు సేవా కార్యక్రమాల్లో ముందుండి పాల్గొని, క్లబ్ సేవలను మరింత విస్తృత పరచాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జోన్ చైర్పర్సన్ కామా వెంకటేశం, రీజినల్ చైర్ పర్సన్ ఏచూరి భాగ్యలక్ష్మి, చార్టర్ ప్రెసిడెంట్ కొనతం సీతారామరెడ్డి, డిస్ట్రిక్ట్ చైర్పర్సన్లు బట్టు మధు, చల్లా ప్రభాకర్ రెడ్డి, ఎడవెల్లి సత్యనారాయణ రెడ్డి, చార్టర్ సభ్యులు రాచకొండ రామ్మోహన్ రావు, రాచకొండ అంజయ్య, బాల వెంకటేశ్వర్లు, పూర్వ అధ్యక్షులు కందిబండ శ్రీనివాసరావు, జిలకర రామస్వామి మరియు లయన్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

# అర్హులకే సదరం ధ్రువపత్రాలు

**మంచిర్యాల జూన్ 27 (క్రైమ్ మిర్రర్):** సదరం--యూడీఐడీ శిబిరాలను పారదర్శకంగా నిర్వహించి, అర్హత కలిగిన దివ్యాంగులకు మాత్రమే ధ్రువపత్రాలు జారీ చేయాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్, సెర్ప్ సీఈఓ దివ్య దేవరాజన్ అధికారులను ఆదేశించారు. శనివారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా అదనపు కలెక్టర్లు, సంబంధిత అధికారులతో సదరం శిబిరాల నిర్వహణ, యూడీఐడీ పోర్టల్‌లో పార్ట్-బి వివరాల నమోదు, హాజరు నమోదు, వెయిటింగ్ లిస్ట్‌లో ఉన్న దివ్యాంగులకు వైద్య పరీక్షల షెడ్యూల్ కేటాయింపు తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. ప్రతి నెలా సదరం--యూడీఐడీ ప్రత్యేక శిబిరాలు తప్పనిసరిగా నిర్వహించాలని, పెండింగ్ దరఖాస్తులు లేకుండా సత్వర పరిష్కారం చూపాలని ఆమె సూచించారు. ప్రతి మండలంలో నెలకు ఒక గ్రామాన్ని ఎంపిక చేసి దివ్యాంగుల గుర్తింపు కార్యక్రమాలు చేపట్టడంతో పాటు, సదరం ధ్రువపత్రం లేని వారికి మీ-సేవ ద్వారా దరఖాస్తులు నమోదు చేయించాలని తెలిపారు. లోకోమోటర్, ఈఎన్‌టీ, నేత్ర వైద్య శిబిరాల నిర్వహణతో పాటు బేరా, సౌండ్‌ప్రూఫ్ పరికరాల అందుబాటు, వినియోగంపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి. చంద్రయ్య మాట్లాడుతూ మీ-సేవ ద్వారా వచ్చిన సదరం దరఖాస్తులను సీనియారిటీ క్రమంలో పరిశీలించి అభ్యర్థులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా పరీక్షలు పూర్తిస్థాయి పారదర్శకతతో నిర్వహిస్తున్నామని చెప్పారు. సమావేశంలో ఆర్ఎంఓ శ్రీధర్‌తో పాటు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.



## ప్రజాస్వామ్య బలోపేతానికి ఓటరు జాబితా ప్రక్షాళన : చందుపట్ల రాజిరెడ్డి

**క్రైమ్ మిర్రర్, భూపాలపల్లి ప్రతినిధి:** ఓటరు జాబితా పరిశుద్ధత, పారదర్శకత లక్ష్యంగా ఎన్నికల సంఘం చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమం అన్ని గ్రామాల్లో ముమ్మరంగా కొనసాగుతోందని పరకాల మార్కెట్ కమిటీ చైర్మన్ చందుపట్ల రాజిరెడ్డి తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడం, అనర్హుల పేర్లను తొలగించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బూత్ స్థాయి అధికారులు గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి ఎన్యూమరేషన్ ఫారాలు అందజేస్తూ ఓటర్ల వివరాలను సేకరిస్తున్నారని తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ పేరు ఓటరు జాబితాలో ఉందో లేదో పరిశీలించుకోవాలని సూచించారు. ప్రత్యేకించి 18 సంవత్సరాలు నిండిన యువత తమ పేర్లను ఓటరు జాబితాలో నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు. అదే విధంగా మరణించినవారు, ఇతర ప్రాంతాలకు శాశ్వతంగా మారినవారు, అనర్హులైన వారి వివరాలను అధికారులకు తెలియజేసి జాబితా పరిశుద్ధతకు సహకరించాలని కోరారు. గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పిస్తూ ఓటరు నమోదు ప్రక్రియను వేగవంతం చేస్తున్నామని రాజిరెడ్డి తెలిపారు. ప్రజాస్వామ్య వ్యవస్థ బలోపేతానికి ఖచ్చితమైన ఓటరు జాబితా ఎంతో అవసరమని, ప్రతి పౌరుడు ఈ కార్యక్రమంలో భాగస్వామి కావాలని అన్నారు. ఎన్నికల సంఘం చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులు సమిష్టిగా కృషి చేయాలని చందుపట్ల రాజిరెడ్డి పిలుపునిచ్చారు. స్వచ్ఛమైన ఓటరు జాబితా రూపకల్పన ద్వారా ప్రజాస్వామ్య విలువలు మరింత బలోపేతం అవుతాయని ఆయన పేర్కొన్నారు

### హోప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం.....

**చందానగర్ క్రైమ్ మిర్రర్ :** చందానగర్..26 హోప్ ఫౌండేషన్ చైర్మన్ కొండ విజయ్ కుమార్ సేవలు అభినందనీయం మని, సమాజాన్ని తనవంతుగా కొంత సేవ చేయాలనే మానవత దృక్పధంతో అన్న దానంతో పాటు అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని వారికి ఈ సందర్భంగా ప్రజలు అభిమానులు తెలిపారు. హోప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిరవహిస్తున్న అన్న దాన కార్యక్రమంలో భాగంగా శనివారం నిర్వహించిన 190వ వారం అన్న ప్రసాదం హోప్ చైర్మన్ కొండ విజయ్ కుమార్ ప్రజలకు వడ్డించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రజలు అధిక సంఖ్యలో విచ్చేసి భోజనాలు చేయడం సంతోషంగా ఉందన్నారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం జరగకుండా హోప్ సభ్యులు అన్ని జాగ్రత్తలు తీసుకొని వారికి ఏలోటు లేకుండా చూసుకుంటున్నారని తెలిపారు. అనేక సేవకార్యక్రమలు చేస్తున్న హోప్ ఫౌండేషన్ చర్మన్ తో పాటు సభ్యులను అభినందించారు...ఈ కార్యక్రమంలో హోప్ ఫౌండేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



## మియాపూర్-పటాన్‌చెరు-ఇస్నాపూర్ వరకు మెట్రో విస్తరించాలి

- కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డికి మాజీ ఎమ్మెల్యే సత్యన్న వినతి
- పారిశ్రామిక ప్రాంతాలకు మెరుగైన రవాణా అవసరం
- ఎన్‌హెచ్-65పై ట్రాఫిక్ రద్దీ తగ్గే అవకాశం
- విద్యార్థులు, ఉద్యోగులకు మెట్రోతో ప్రయోజనం



**హైదరాబాద్, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి జూన్ 27:** హైదరాబాద్ మెట్రో రైలు ఫేజ్--2లో మియాపూర్ నుంచి పటాన్‌చెరు మీదుగా ఇస్నాపూర్ మున్సిపాలిటీ వరకు మెట్రో మార్గాన్ని విస్తరించేలా చర్యలు తీసుకోవాలని మాజీ సంగారెడ్డి ఎమ్మెల్యే సత్యన్న కేంద్ర బొగ్గు మరియు గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డిని కోరారు. ఈ మేరకు శనివారం ఆయనకు వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా సత్యన్న మాట్లాడుతూ, హైదరాబాద్ మెట్రో ఫేజ్--2కు కేంద్ర ప్రభుత్వం సహకారం అందించడం స్వాగతించదగ్గ విషయమన్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కేంద్ర ప్రభుత్వంతో సమన్వయం చేసి మెట్రో ప్రాజెక్టుకు ఆమోదం లభించేలా కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి చేసిన కృషి అభినందనీయమని పేర్కొన్నారు. గతంలో మాజీ ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్ రావు హయాంలో మియాపూర్, పటాన్‌చెరు, ఇస్నాపూర్ వరకు మెట్రో విస్తరణకు రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలిపిందని గుర్తు చేశారు. ప్రస్తుతం ఫేజ్--2లో ఈ మార్గాన్ని ఇక్రిసాట్ వరకు మాత్రమే ప్రతిపాదించడం వల్ల పటాన్‌చెరు, ఇస్నాపూర్‌తో పాటు పరిసర ప్రాంతాల ప్రజలకు పూర్తి ప్రయోజనం కలగదని కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. పటాన్‌చెరు, పాశమైలారం పారిశ్రామిక ప్రాంతం, ఐఐటీ హైదరాబాద్, గీతం యూనివర్సిటీతో పాటు అనేక విద్యాసంస్థలు, వేగంగా అభివృద్ధి చెందుతున్న నివాస ప్రాంతాల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఈ మెట్రో కారిడార్ అత్యంత అవసరమని వివరించారు. ఈ మార్గం అందుబాటులోకి వస్తే వేలాది మంది కార్మికులు, ఉద్యోగులు, విద్యార్థులతో పాటు సంగారెడ్డి, జహీరాబాద్, పొరుగు కర్ణాటక ప్రాంతాల ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం లభిస్తుందని, జాతీయ రహదారి--65పై ట్రాఫిక్ రద్దీ, కాలుష్యం తగ్గుతాయని తెలిపారు. ప్రజల అవసరాలు, పారిశ్రామికాభివృద్ధి, విద్యార్థులు, ఉద్యోగుల రవాణా అవసరాలను దృష్టిలో ఉంచుకుని మియాపూర్, పటాన్‌చెరు, ఇస్నాపూర్ మెట్రో మార్గాన్ని హైదరాబాద్ మెట్రో ఫేజ్--2లో చేర్చేలా రాష్ట్ర ప్రభుత్వంతో చర్చించి అవసరమైన చర్యలు తీసుకోవాలని కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డిని సత్యన్న కోరారు. ఈ కార్యక్రమంలో మెట్రోరైల్ సాధన సమితి వ్యవస్థాపక సభ్యులు రుద్రారం శంకర్, మెట్టు శ్రీధర్, సురేందర్, సాయితేజ పాల్గొన్నారు.

## ఓటరు జాబితా పరిశుద్ధతకు ప్రజలు సహకరించాలి : చల్ల రమేష్ రెడ్డి

- స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమానికి మద్దతు
- ఇంటింటికీ వెళ్లి ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ
- సూరారం గ్రామ ప్రజలు బాధ్యతగా వ్యవహరించాలి : చల్ల రమేష్ రెడ్డి

**క్రైమ్ మిర్రర్, భూపాలపల్లి ప్రతినిధి:** ప్రజాస్వామ్య వ్యవస్థకు ఓటరు జాబితా అత్యంత కీలకమని, ఖచ్చితమైన మరియు పరిశుద్ధమైన ఓటరు జాబితా రూపకల్పనలో ప్రతి పౌరుడు భాగస్వామి కావాలని జిల్లా ఎన్నికల అధికారి చేసిన పిలుపును కాంగ్రెస్ పార్టీ సూరారం గ్రామ శాఖ అధ్యక్షులు చల్ల రమేష్ రెడ్డి స్వాగతించారు. శనివారం మహాదేవపూర్ మండలంలో జరుగుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమానికి సూరారం గ్రామ ప్రజలు కూడా ఈ ప్రత్యేక పూర్తి సహకారం అందించాలని ఆయన కోరారు.

### ఇంటింటికీ వచ్చే బీఎల్ఓలకు సహకరించాలి

ఈ సందర్భంగా చల్ల రమేష్ రెడ్డి మాట్లాడుతూ, బూత్ స్థాయి అధికారులు (బీఎల్ఓలు) ఇంటింటికీ వెళ్లి ఎన్యూమరేషన్ ఫారాలు అందజేస్తున్నారని, ప్రజలు తమ కుటుంబ వివరాలు, ఓటరు వివరాలను సక్రమంగా నమోదు చేసి తిరిగి అందించాలని సూచించారు. ఓటరు జాబితాలో పేర్లు ఉన్నాయా లేదా అనేది ప్రతి ఒక్కరూ పరిశీలించుకోవాలని తెలిపారు.

### అర్హుల పేర్లు నమోదు - అనర్హుల పేర్ల తొలగింపు

18 సంవత్సరాలు పూర్తి చేసుకున్న యువత తప్పనిసరిగా ఓటరు జాబితాలో తమ పేర్లు నమోదు చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. అదే సమయంలో మరణించినవారు, ఇతర ప్రాంతాలకు శాశ్వతంగా మారినవారు, అర్హత కోల్పోయిన వారి వివరాలను అధికారులకు తెలియజేసి జాబితా పరిశుద్ధతకు సహకరించాలని కోరారు.

### ప్రజాస్వామ్యానికి బలమైన పునాది

ఖచ్చితమైన ఓటరు జాబితా ప్రజాస్వామ్యానికి బలమైన పునాది అని పేర్కొన్న చల్ల రమేష్ రెడ్డి, ఎన్నికల సంఘం చేపడుతున్న ప్రత్యేక సర్వే విజయవంతం కావాలంటే ప్రజల సహకారం అవసరమని అన్నారు. గ్రామంలోని ప్రతి కుటుంబం ఎన్నికల సిబ్బందికి పూర్తి సమాచారం అందించి బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు.



# గ్రామీణ రవాణ సౌకర్యాలే లక్ష్యంగా రూ. 16.13 కోట్ల పనులకు శంకుస్థాపన... రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార, పౌర సంబంధాల శాఖల మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి

**కూసుమంచి మండలంలో బీటీ రోడ్లు, వంతెనల నిర్మాణ పనులకు శ్రీకారం**

**వర్షాకాలంలో ప్రజలకు ఇబ్బందులు లేకుండా శాశ్వత మౌళిక వసతుల కల్పనే ప్రభుత్వ లక్ష్యం**

**చిరుజల్లుల మధ్యే దుబ్బతండా, లాల్‌సింగ్ తండా, జీళ్ళచెరువు గ్రామాల్లో విస్తృతంగా పర్యటించిన మంత్రి పొంగులేటి**





**క్రైమ్ మిర్రర్ పాలేరు: కూసుమంచి జూన్-27:** గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు ఎదుర్కొనే రవాణా సమస్యలకు శాశ్వత పరిష్కారం కల్పించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార, పౌర సంబంధాల శాఖల మంత్రి వర్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. శనివారం పాలేరు నియోజకవర్గ పరిధిలోని కూసుమంచి మండలంలో విస్తృతంగా పర్యటించిన మంత్రి, చిరుజల్లులను సైతం లెక్కచేయకుండా దుబ్బతండా, లాల్‌సింగ్ తండా, జీళ్ళచెరువు గ్రామాల్లో మొత్తం రూ. 16.13 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న బీటీ రోడ్లు, వంతెనల నిర్మాణ పనులకు జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్, పోలీస్ కమీషనర్ సునీల్ దత్ లతో కలిసి శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ వర్షాకాలంలో తండాలు, గ్రామాల ప్రజలు బురద రోడ్లు, ఉధృతంగా ప్రవహించే వాగుల కారణంగా పడుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ఈ పనులను మంజూరు చేసినట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన రహదారులు, వంతెనలు నిర్మించడం ద్వారా ప్రజల రాకపోకలు సులభతరం కావడంతో పాటు అత్యవసర సేవలు, విద్య, వ్యవసాయ కార్యకలాపాలకు ఎలాంటి ఆటంకం లేకుండా ఉంటుందని అన్నారు. వర్షాలు కురుస్తున్నప్పటికీ ప్రజా ప్రయోజనాల కోసం చేపట్టే అభివృద్ధి కార్యక్రమాలు ఆగవని స్పష్టం చేశారు. అధికారులు నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ నిర్దేశిత గడువులోగా పనులను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. పర్యటనలో భాగంగా దుబ్బతండా గ్రామంలో జెడ్పీ రోడ్డు గైగోల్లపల్లి నుంచి దుబ్బతండా వరకు రూ. 2.10 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న బీటీ రోడ్డు నిర్మాణ పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. అలాగే జెడ్పీ రోడ్డు నుంచి కొత్తూరు--ఎర్రగడ్డ తండా మీదుగా దుబ్బతండా వరకు రూ. 4.50 కోట్ల వ్యయంతో నిర్మించనున్న బీటీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం లాల్‌సింగ్ తండా నుంచి నేరేడువాయి వరకు రూ. 2.03 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న బీటీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. జీళ్ళ చెరువు గ్రామంలో జీళ్ళచెరువు మీదుగా కొండాపురం నుంచి మోటాపురం వెళ్లే ప్రధాన రహదారిపై రూ. 7.50 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్న రెండు వంతెనల నిర్మాణ పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో పీఆర్ ఎస్ఈ వెంకట్ రెడ్డి, ఖమ్మం ఆర్డీవో శ్రీనివాస్, పిడి హౌజింగ్ భూక్యా శ్రీనివాస్, కూసుమంచి మండల తహసీల్దార్ సైదులు, వివిధ శాఖల జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయి అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కార్పొరేట్ విజిలెన్స్ జీఎం రాజీవ్‌కుమార్‌కు ఆత్మీయ సన్మానం

**మందమర్రి ఏరియాలో ఘనంగా సత్కరించిన సింగరేణి అధికారులు**

**మందమర్రి జూన్ 27 (క్రైమ్ మిర్రర్):** సింగరేణి సంస్థలో సుదీర్ఘకాలం పాటు విశిష్ట సేవలు అందించి, త్వరలో పదవీ విరమణ చేయనున్న కార్పొరేట్ విజిలెన్స్ జీఎం పి.రాజీవ్ కుమార్‌ను శనివారం మందమర్రి ఏరియాలో ఘనంగా సన్మానించారు. మందమర్రి ఏరియా జీఎం కార్యాలయానికి విచ్చేసిన ఆయనకు అధికారులు ఆత్మీయ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఏరియా జనరల్ మేనేజర్ ఎన్.రాధాకృష్ణ మాట్లాడుతూ రాజీవ్ కుమార్ తన సుదీర్ఘ సర్వీసులో సంస్థ పురోభివృద్ధికి ఎంతగానో శ్రమించారని కొనియాడారు. విధి నిర్వహణలో ఆయన చూపిన నిబద్ధత, అంకితభావం అభినందనీయమన్నారు. అనంతరం రాజీవ్ కుమార్‌ను శాలువాతో ఘనంగా సత్కరించి, జ్ఞాపికను అందజేశారు. భవిష్యత్తులో ఆయన ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో గడపాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఈ అండ్ ఎం అధికారి బాలాజీ భగవతి జా, ఐఈడీ డీజీఎం కె.కిరణ్ కుమార్, ఏఎస్ఓ డీవైజీఎం వి.మురళి, సర్వే డీజీఎం భుఖ్య దేశాయ్, సివిల్ డీజీఎం షేక్ మదీనా భాష, ఫారెస్ట్ అధికారి నవీన్, క్వాలిటీ అధికారి ప్రదీప్, పర్సనల్ డీజీఎం విజయ్ సందీప్, ఎస్.రాజ్ కుమార్, అకౌంట్స్ మేనేజ్‌మెంట్ ట్రైనీలు పాల్గొన్నారు.





## కాళేశ్వరంలో 'ప్రభుత్వ భూమి' కబ్జా..?

**- సర్వే నంబర్ 129లో ఆక్రమణలపై తీవ్ర ఆరోపణలు**

**- సంబంధిత అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని ప్రజల డిమాండ్**

**క్రైమ్ మిర్రర్, భూపాలపల్లి ప్రతినిధి:** కాళేశ్వరం శివారులోని సర్వే నంబర్ 129కు చెందిన ప్రభుత్వ భూమి కబ్జాకు గురవుతున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వ భూమిలో కొందరు వ్యక్తులు అక్రమంగా జోక్యం చేసుకుంటూ ఆక్రమణలకు పాల్పడుతున్నారని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వానికి చెందిన విలువైన భూములు క్రమంగా ప్రైవేటు వ్యక్తుల ఆధీనంలోకి వెళ్లే పరిస్థితులు ఏర్పడుతున్నాయని గ్రామస్థులు పేర్కొంటున్నారు. సంబంధిత రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన నిర్వహించి భూమి హద్దులను నిర్ధారించాలని కోరుతున్నారు. ఆక్రమణలు నిజమైతే బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వ భూములు ప్రజల ఆస్తి అని, వాటిని పరిరక్షించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. సర్వే నంబర్ 129లో జరుగుతున్న పరిణామాలపై సమగ్ర విచారణ చేపట్టి వాస్తవాలను ప్రజల ముందుకు తీసుకురావాలని కోరుతున్నారు. ఇప్పటికైనా రెవెన్యూ, సర్వే శాఖ అధికారులు స్పందించి ప్రభుత్వ భూమిని కాపాడేందుకు తగిన చర్యలు చేపట్టాలని పలువురు గ్రామస్తులు, ప్రజా సంఘాల ప్రతినిధులు విజ్ఞప్తి చేస్తున్నారు. భవిష్యత్తులో ఇలాంటి ఆక్రమణలకు అవకాశం లేకుండా కఠిన చర్యలు అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

## గొల్లపల్లి కేజీబీవీలో గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం...!

**జగిత్యాల జిల్లా (క్రైమ్ మిర్రర్):** ?గొల్లపల్లి మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ)లో ఖాళీగా ఉన్న గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టుల భర్తీకి అర్హులైన మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు పాఠశాల ప్రత్యేక అధికారి వి. పద్మ తెలిపారు.

**పోస్టు వివరాలు మరియు అర్హతలు:**

ఖాళీ: ప్రస్తుతం పాఠశాలలో గణితం (వీఫ్ష్ట్రవఏఘఅఎం) పోస్టు ఖాళీగా ఉంది.

విద్యార్హతలు: అభ్యర్థులు గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుంచి సంబంధిత సబ్జెక్టులో డిగ్రీ లేదా పీజీ ఉత్తీర్ణతతో పాటు, బి.ఎడ్ (దీ.జుస) మరియు టెట్ (ుజు) అర్హత కలిగి ఉండటం తప్పనిసరి. అదనపు ప్రయోజనం: బోధనా అనుభవం ఉన్న అభ్యర్థులకు ఎంపికలో ప్రాధాన్యత ఇవ్వబడుతుంది.

**ముఖ్య గమనిక:**

ఈ పోస్టు పూర్తిగా తాత్కాలిక ప్రాతిపదికన భర్తీ చేయబడుతుందని, కేవలం మహిళా అభ్యర్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవడానికి అర్హులని ప్రత్యేక అధికారి స్పష్టం చేశారు.

**దరఖాస్తు సమర్పణ:**

అభ్యర్థులు తమ ధృవపత్రాల జిరాక్స్ ప్రతులతో పాటు, జూన్ 27 సాయంత్రం నుండి జూన్ 30, 2026 మంగళవారం సాయంత్రం 4:30 గంటల లోపు పాఠశాల కార్యాలయంలో తమ దరఖాస్తులను సమర్పించాలని పేర్కొన్నారు.



## ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ....

**చందానగర్ క్రైమ్ మిర్రర్ :** ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ ఎస్ ఐ ఆర్ కార్యక్రమంలో భాగంగా, చందానగర్ పరిధిలోని వేముకుంట మరియు తారాన్ నగర్ ప్రాంతాలకు చెందిన పోలింగ్ స్టేషన్ నెం. 65 మరియు 119 పరిధిలోని ఓటర్లకు బూత్ లెవల్ అధికారులు (బీ ఎల్ ఓ) లు ఎన్యూమరేషన్ ఫారాలను పంపిణీ చేశారు.ఓటరు జాబితాను ఖచ్చితమైనది, సమగ్రమైనది మరియు తాజా సమాచారంతో రూపొందించేందుకు ఈ ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం నిర్వహించబడుతోంది. ఈ కార్యక్రమంలో భాగంగా బూత్ లెవల్ అధికారులు ఇంటింటికీ వెళ్లి ఎన్యూమరేషన్ ఫారాలను పంపిణీ చేయడంతో పాటు, ఓటర్లు అవసరమైన వివరాలను సక్రమంగా నమోదు చేయడానికి సహకరిస్తున్నారు. ఈ సందర్భంగా సహాయ ఎన్నికల నమోదు అధికారి (ఏ ఈ ఆర్ ఓ )అర్హులైన ప్రతి ఓటరు బూత్ లెవల్ అధికారులకు పూర్తి సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. ఎన్యూమరేషన్ ఫారాలను స్వీకరించి, వాటిని సరైన వివరాలతో నింపి, అవసరమైన ధృవీకరణ పత్రాలను నిర్ణీత గడువులోగా సమర్పించాలని కోరారు. అలాగే అర్హత పొందిన కుటుంబ సభ్యుల పేర్లను ఓటరు జాబితాలో నమోదు చేయించుకోవాలని, పేరు, చిరునామా, వయస్సు లేదా ఇతర వివరాలలో ఏవైనా మార్పులు ఉంటే వాటిని బూత్ లెవల్ అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఖచ్చితమైన, తప్పులు లేని మరియు సమగ్ర ఓటరు జాబితా తయారీలో ప్రజల భాగస్వామ్యం, సహకారం ఎంతో కీలకమని (ఏ ఈ ఆర్ ఓ )తెలిపారు. అందువల్ల బీ.ఎల్. ఓ.లు ఇంటింటికీ వచ్చినప్పుడు ప్రతి ఒక్కరూ వారికి సంపూర్ణ సహకారం అందించి, ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ప్రజలకు ఈ సందర్భంగా వారు విజ్ఞప్తి చేశారు.

### శనివారం రోజు కృష్ణ గోపాల్ సేవాసమితి ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు

**ఎల్బీనగర్ జూన్ 27 క్రైమ్ మిర్రర్ ప్రతినిధి :** శనివారం రోజు కృష్ణ గోపాల్ సేవా సమితి ఆధ్వర్యంలో పలు ఆశ్రమాలలో సేవా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఉదయము అనాధ విద్యార్థుల ఆశ్రమంలో అల్పాహారం అందజేశారు, అనంతరం లూధియానా నివాసి స్వర్గీయ ఆశ అగర్వాల్ నెలవారి శ్రద్ధాంజలిని పురస్కరించుకొని వృద్ధుల ఆశ్రమంలో అల్పాహార వితరణ నిర్వహించారు మరియు కర్మన్ ఘాట్ ఆంజనేయ స్వామి దేవాలయంలో దాదాపు 2,000 మంది భక్తులకు ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. అంబాల నివాసి స్వర్గీయ సోమనాథ్ గుప్తా జన్మదిన సందర్భంగా అనాధ పిల్లలకు మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేశారు. ఈ సేవా కార్యక్రమాల అన్నింటిలో డాక్టర్ కపిల్ కుమార్ అగ్రవాల్ తో పాటు సేవా సమితి సభ్యులు అందరూ ఉత్సాహంగా పాల్గొని కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించారు.



# చినుకుల సాక్షిగా.. ప్రగతి అడుగులు!

- వర్షపు జల్లుల మధ్యే కూసుమంచి మండలంలో రూ. 16.13 కోట్ల పనులకు శంకుస్థాపనలు చేసిన మంత్రి పొంగులేటి

- వానాకాలం రవాణా కష్టాలకు శాశ్వత పరిష్కారంగా వంతెనలు.. బీటీ రోడ్లు

**ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో:** ఆకాశం నుంచి వర్షపు చినుకులు నేలను తాకుతున్నా వాతావరణం అనుకూలించకపోయినా లెక్కచేయకుండా, గ్రామీణ రవాణా కష్టాలను తీర్చడమే ధ్యేయంగా ప్రగతి బాట సాగింది. పాలేరు నియోజకవర్గ పరిధిలోని కూసుమంచి మండలంలో శనివారం తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి విస్తృతంగా పర్యటించారు. ఒకవైపు చిరుజల్లులు కురుస్తున్నా... వర్షపు చినుకుల సాక్షిగానే దుబ్బతండా, లాల్ సింగ్ తండా, జీళ్ళచెరువు గ్రామాల్లో రూ. 16.13 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న బీటీ రోడ్లు, వంతెనల నిర్మాణ పనులకు మంత్రి పొంగులేటి శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో మంత్రి మాట్లాడుతూ.. వర్షాకాలంలో తండాలు, పల్లె ప్రజలు బురద రోడ్లు, ఉధృతంగా ప్రవహించే వాగుల వల్ల బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోకుండా ఉండేందుకే ఈ పనులను త్వరితగతిన మంజూరు చేయించామని పేర్కొన్నారు. వానలు పడుతున్నా ప్రజల కోసం ప్రగతి పనులు ఆపబోమని, అధికారులు కూడా అంతే వేగంతో నాణ్యతా ప్రమాణాలతో, నిర్దేశిత గడువులోగా పనులను పూర్తి చేయాలని ఆదేశించారు.

**- రూ. 16.13 కోట్లతో శంకుస్థాపనలు..**

మంత్రి పొంగులేటి తన పర్యటనలో భాగంగా దుబ్బతండా గ్రామంలో జడ్పీ రోడ్డు గైగోళ్లపల్లి నుంచి దుబ్బతండా వరకు రూ. 2.10 కోట్ల అంచనా వ్యయంతో, అలాగే జడ్పీ రోడ్డు నుండి కొత్తూరు – ఎర్రగడ్డ తండా మీదుగా దుబ్బతండా వరకు రూ. 4.50 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టే బీటీ రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం లాల్ సింగ్ తండా నుంచి నేరేడువాయి వరకు రూ. 2.03 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్న బీటీ రోడ్డు పనులకు, జీళ్ళచెరువు గ్రామంలో జీళ్ళచెరువు మీదుగా కొండాపురం నుంచి మోటాపురం వెళ్ళే ప్రధాన రహదారిపై రూ. 7.50 కోట్ల వ్యయంతో నిర్మించ తలపెట్టిన రెండు వంతెనల (బ్రిడ్జిల) నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ పర్యటనలో మంత్రి వెంట జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్, పోలీస్ కమిషనర్ సునీల్ దత్, వివిధ శాఖల జిల్లా, నియోజక, మండల స్థాయి అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





# గొల్లపల్లి మండలంలో సంతాపం తెలిపిన మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్...!





**జగిత్యాల జిల్లా (క్రైమ్ మిర్రర్)** ?గొల్లపల్లి మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన ఇద్దరు ముఖ్య నాయకులు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా, వారి కుటుంబాలను మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ పరామర్శించారు. ?మండలంలోని భీంరాజుపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి, మాజీ గుర్రం భూమయ్య కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ ఇటీవలే మృతి చెందారు. అదేవిధంగా, దట్నూర్ గ్రామానికి చెందిన మాజీ గ్రామ పంచాయతీ కో–ఆప్షన్ సభ్యులు హన్మాండ్లు గౌడ్ కూడా అనారోగ్యంతో కన్నుమూశారు. ?ఈ సమాచారం తెలుసుకున్న కొప్పుల ఈశ్వర్ ఆయా కుటుంబ సభ్యులను కలిసి ఓదార్చారు. హన్మాండ్లు గౌడ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మరణించిన నాయకుల ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించిన మాజీ మంత్రి, వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ పరామర్శ కార్యక్రమాల్లో స్థానిక బీఆర్ఎస్ నాయకులు మరియు ముఖ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఖమ్మంలో కొనసాగుతున్న ఏసీబీ ట్రాప్‌లు!

**బాణాపురం గ్రామ పంచాయతీ కార్యదర్శి అరెస్ట్!**

**25 వేల లంచం తీసుకుంటూ పట్టుబడ్డ పంచాయతీ కార్యదర్శి తమ్మిశెటి సురేష్**

**ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో:** ఖమ్మం జిల్లాలో అవినీతి అధికారులపై ఏసీబీ ఉక్కుపాదం కొనసాగుతోంది. ఇటీవల వరుసగా వివిధ శాఖలకు చెందిన అధికారులు లంచాలు తీసుకుంటూ ఏసీబీకి చిక్కుతున్న ఘటనలు కలకలం రేపుతుండగా, తాజాగా ముదిగొండ మండలంలో బాణాపురం గ్రామ పంచాయతీ కార్యదర్శి అవినీతి వలలో చిక్కడం చర్చనీయాంశంగా మారింది. బాణాపురం గ్రామ పంచాయతీ కార్యదర్శి తమ్మిశెట్టి సురేష్ ఇంటి నిర్మాణానికి సంబంధించిన బిల్డింగ్ పర్మిషన్, ఇంటి నంబర్ మంజూరు చేయడానికి రూ. 40 వేల లంచం డిమాండ్ చేసినట్లు సమాచారం. అదే గ్రామానికి చెందిన వీరబాబు అనే వ్యక్తి తన ఇంటి నిర్మాణ అనుమతుల కోసం దరఖాస్తు చేయగా చివరకు రూ. 25 వేల వద్ద ఒప్పందం కుదిరింది. అయితే లంచం ఇవ్వడానికి ఇష్టపడని వీరబాబు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు వారి సూచనల మేరకు రైతు వేదిక సమీపంలో కార్యదర్శి సురేశ్‌కు రూ. 25 వేల లంచం అందజేస్తుండగా, అప్పటికే మాటు వేసిన ఏసీబీ డీఎస్పీ వై. రమేష్ నేతృత్వంలోని బృందం దాడి చేసి కార్యదర్శిని రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకుంది. అనంతరం అతడిపై కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. ఈ ఘటనతో బాణాపురం గ్రామంలో ఒక్కసారిగా కలకలం రేగింది. ప్రభుత్వ సేవలు అందించాల్సిన అధికారులు ప్రజల నుంచి లంచాలు డిమాండ్ చేయడం పట్ల స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల ఖమ్మం జిల్లాలో రెవెన్యూ, స్థానిక సంస్థలు, ఇతర ప్రభుత్వ శాఖలకు చెందిన పలువురు అధికారులు ఏసీబీ వలలో చిక్కుతున్నారు. దీంతో ప్రభుత్వ యంత్రాంగంలో అవినీతిపై ఏసీబీ నిఘా మరింత కఠినంగా మారిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ప్రజలు కూడా లంచాలు డిమాండ్ చేసే అధికారులపై నిర్భయంగా ఫిర్యాదు చేయడం వల్లే ఇలాంటి కేసులు వెలుగులోకి వస్తున్నాయని టోల్ ఫ్రీ నంబర్ 1064కు లేదా వాట్సాప్ నంబర్ 94404 46106కు ఫిర్యాదు చేయాలని అవినీతి నిరోధక శాఖ డీఎస్పీ వై. రమేష్ తెలిపారు.




# నాంపల్లిలో డ్రగ్స్ వ్యతిరేక అవగాహన ర్యాలీ




**విద్యార్థుల్లో చైతన్యం నింపిన సీఐ దూది రాజు**

**నాంపల్లి(క్రైమ్ మిర్రర్):** అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని, నాంపల్లి పోలీసులు గురువారం విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమం చేపట్టారు. నాంపల్లి సర్కిల్ ఇన్స్పెక్టర్ దూది రాజు నేతృత్వంలో, ఎస్ఐ లింగారెడ్డి సిబ్బంది కలిసి, స్థానిక కస్తూర్బా బాలికల పాఠశాలలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. మాదకద్రవ్యాల మహమ్మారి యువత భవిష్యత్తును, ఎలా నాశనం చేస్తుందో సీఐ దూది రాజు విద్యార్థినులకు వివరించారు. నార్కోటిక్ నేరాలకు పాల్పడితే ఎదురయ్యే కఠిన శిక్షలు, డ్రగ్స్ బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆయన సూటిగా, స్పష్టంగా మాట్లాడి విద్యార్థుల్లో చైతన్యం నింపారు.

**సీఐ దూది రాజు సేవలు ప్రశంసనీయం**

సమాజంలో శాంతిభద్రతల పరిరక్షణతో పాటు, యువతను సన్మార్గంలో నడిపించేందుకు సీఐ దూది రాజు నిరంతరం కృషి చేస్తున్నారు. మాదకద్రవ్యాల నిర్మూలన కోసం పాఠశాల స్థాయి నుంచే అవగాహన కల్పించాలనే ఆయన దూరదృష్టి, చొరవ స్థానికంగా అందరి మన్ననలు పొందుతున్నాయి. విద్యార్థులతో మమేకమై, స్నేహపూర్వకంగా వివరిస్తూ వారి భవిష్యత్తుపై బాధ్యత కలిగిన అధికారిగా ఆయన పేరు తెచ్చుకున్నారు. అనంతరం విద్యార్థినులు, ఉపాధ్యాయులు, పోలీసు సిబ్బందితో కలిసి "డ్రగ్స్ వద్దు - జీవితం ముద్దు" అంటూ ప్లకార్డులు ప్రదర్శించారు. ఈ ర్యాలీ పాఠశాల నుంచి ప్రధాన కూడళ్ల మీదుగా సాగి ప్రజల్లోనూ అవగాహన కల్పించింది. ఈ సందర్భంగా సీఐ దూది రాజు మాట్లాడుతూ.. "యువత దేశ భవిష్యత్తని అన్నారు. కాసేపు ఆనందం కోసం జీవితాన్ని నాశనం చేసుకోవద్దని, తల్లిదండ్రుల కలలను సాకారం చెయ్యడంలో కృషి చెయ్యాలన్నారు. డ్రగ్స్‌కు సంబంధించిన సమాచారం ఉంటే, వెంటనే పోలీసులకు తెలియజేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు, సిబ్బంది పాల్గొన్నారు.



## తెలంగాణ ఉద్యమానికి అంకితభావంతో సేవలందించిన గొట్టిముక్కల పద్మారావుకు కల్వకుంట్ల కవిత నివాళి

**కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి...ఆయన సేవలు చిరస్మరణీయమని కొనియాడిన తెలంగాణ రక్షణ సేన అధినేత్రి**

**కూకట్ పల్లి, జూన్ 27 (క్రైమ్ మిర్రర్) :** తెలంగాణ ఉద్యమంలో విశిష్ట పాత్ర పోషించిన ఉద్యమ నాయకుడు, ప్రముఖ సినీ నిర్మాత, సీనియర్ రాజకీయ నాయకుడు దివంగత గొట్టిముక్కల పద్మారావు మరణం పట్ల తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) అధినేత్రి కల్వకుంట్ల కవిత తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె దివంగత పద్మారావు చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ క్లిష్ట సమయంలో ధైర్యంగా ఉండాలని వారికి ఓదార్పునిచ్చారు. కల్వకుంట్ల కవిత మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర సాధన కోసం అనేక మంది ఉద్యమకారులతో కలిసి గొట్టిముక్కల పద్మారావు చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. ఉద్యమ స్ఫూర్తిని ప్రజల్లో నింపడంలో, సామాజిక చైతన్యాన్ని పెంపొందించడంలో ఆయన విశేష కృషి చేశారని కొనియాడారు. రాజకీయ రంగంతో పాటు సినీ రంగంలోనూ ఆయన తనదైన ముద్ర వేసి ప్రజల గౌరవాన్ని పొందారని అన్నారు. అంకితభావం, నిబద్ధత, ప్రజల పట్ల సేవా దృక్పథంతో సాగిన ఆయన జీవితం భావితరాలకు ఆదర్శంగా నిలుస్తుందని కవిత పేర్కొన్నారు. ఆయన మరణం తెలంగాణ సమాజానికి, రాజకీయ రంగానికి తీరని లోటని ఆవేదన వ్యక్తం చేశారు. దివంగత నేత ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబ సభ్యులకు ఈ విషాదాన్ని తట్టుకునే మనోధైర్యాన్ని ప్రసాదించాలని భగవంతుడిని ప్రార్థించారు.

## ఓటు ను కాపాడుకోని బీజేపీ కి బుద్ధి చెప్పుదాం

**సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్**

**కుత్బుల్లాపూర్, జూన్ 27 (క్రైమ్ మిర్రర్):** ప్రత్యేక సమగ్ర సవరణ(ఎస్ ఐ ఆర్) పేరుతో ప్రజల ఓట్లను తొలగించి వారికి అనుకూలమైన వాళ్ళను కాపాడదానికి తీసుకువచ్చిందే ఎస్ ఐ ఆర్ అని కావున ప్రజలందరూ తమ ఓట్లను కోల్పోకుండా ఎస్ ఐ ఆర్ కార్యక్రమంలో పాల్గొని కాపాడుకొని రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని కూ ని ఉన్నటువంటి బిజెపిని రానున్న ఎన్నికల్లో ఓడ కొట్టడానికి సిద్ధం కావాలని ఎస్ ఐ ఆర్ లో అందరూ పాల్గొనాలని నినాదంతో కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో శనివారం షాపూర్ నగర్ లో గోడ పత్రికను ఆవిష్కరించారు. అక్రమ చొరబాటు దారు లు ఇతర దేశస్తులు మరణించిన వారి ఓట్లను తొలగిస్తున్నామని ప్రచారంతో తీసుకువచ్చిన సర్ అసలు ఉద్దేశం బిజెపికి వ్యతిరేకులు అయినటువంటి ముస్లిం, క్రైస్తవ, దళిత, బహుజనుల ఓట్లు తొలగించడమే ప్రధాన ఉద్దేశం అని అన్నారు. రాజ్యాంగంలో ఓటు పౌరుని హక్కు అని చెప్పే, ఓటరుగా చేర్చుకోవాల్సింది పోయి గతంలో ఓటర్ అయిన వారినీ కూడా అనుమానాస్పదం గా ఉంచడం, పేర్లలో చిన్న చిన్న తప్పులు ఉన్నప్పటికీ పక్కన పెట్టడం లాంటివి అనేకం జరుగుతున్నాయని దీనివల్ల నష్టపోయేది ఎక్కువగా పనిచేసి బతికే కార్మికులేనని అన్నారు.